# అస్తిత్వం

మూలం: యాల్మార్ సోడర్బెయు

అనువాదం:కలశపూడి శ్రీనివాస రావు

స్వీడన్ ముఖ్య పట్నం అయిన స్టాక్ హోమ్ 14 ద్వీపాల నగరం. వాటిలో గమ్లా స్టేన్ ఒక పురాతనమైన ద్వీపం. స్టోర్కిరన్ కారోనేషన్ చర్చికి తూర్పువైపునున్న సన్నటి వీధిలో ఎర్రని రంగు ఇల్లు సాధారణ స్వీడిష్ దేశీయుల మధ్యతరగతి జీవనానికి ప్రతీక. అటువంటి ఒక ఇంటి పెద్ద పెద్ద కిటికీల నుండి శీతకాలపు తీవ్రమైన ఎండ గదిలో పడుతున్నది. ఆ వెలుగుకు గదిలో ఉన్న ఆకు పచ్చని తివాసి మెరుస్తోంది. ఆ వెలుగులో ఒక చిన్న కుర్రాడు ఆడుకుంటున్నాడు. ఆ కుర్రాడికి ప్రపంచం గురించి తెలిసింది చాలా తక్కువ. తాను చిన్నవాడిని, తాను పెద్దవాడిని అవుతానని తెలుసు. కాని పుట్టడం గురించి కాని, చావు గురించి కాని తెలియదు. తనకి నాలుగు సంవత్సరాలని, త్వరలో ఐదు సంవత్సరాలు వస్తాయని తెలుసు, కాని 'సంవత్సరం' అంటే ఏమిటో తెలియదు. ఆ కుర్రాడి కాలంలో మూడే రోజులు ఉన్నాయి, నిన్న, నేడు, రేపు.

"నాన్నా" ఆడుతూ ఆడుతు మధ్యలో పిలిచాడు. తండ్రి అప్పడే ఉదయపు పలహారం తిని, చుట్ట ముట్టించాడు. ఆరోజుకి ఆతనికి అది మొదటి చుట్ట. ఆతను కాలాన్ని కాల్చిన చుట్టలతో కొలుస్తాడు.

"నిన్న రాత్రి బోల్డు కలలోచ్చాయి నాకు. ఆ కలలో ఈ గది, ఈ గదిలో కుర్చీలు, ఆకుపచ్చని తివాసి, ఆద్దాలు, కటికీలు, గోడ గడియారం, గది తలుపులు, అలమర ...." అలా అంటున్నవాడు మాటలాపి, కిటికి దగ్గరకి వెళ్ళి పిల్లి మెగ్గలు వెయ్యడం మెదలు పెట్టాడు ఆనందంగా. ఆడుకోడానికి హాయిగా అనిపించే ఆ జాగా ఆ కుర్రాడికి చాలా ఇష్టం.

"అహా.. " అన్నాడుతండ్రి తన వార్తాపత్రిక అంచు నుండి కులాసాగా కొడుకువైపు ఆప్యాయంతో ఒక చూపు చూసి. ఆకుర్రాడు తండ్రివైపు తిరిగి హయిగా నవ్వాడు. నవ్వు ఇంకా సహజమైన ఆనందాన్ని మాత్రమే తెలిపే వయసు ఆ కుర్రాడిది. క్రిందిటి రోజు కిటికి దగ్గర నిలబడి చంద్రుణ్ణి చూసి ఇలాగే నవ్వాడు. చంద్రుడు వింతగా ఉన్నాడని కాదు, వెలుగు విరజిమ్మే చంద్రబింబం ఆనందాన్ని కలిగించడంవల్ల.

"అన్నింటి కంటే ఈ బొమ్మ ఎన్నోసార్లు కలలో కనిపించింది." అని అన్నాడు. నవ్వడం అయిపోగానే. మోకాళ్ళ మీద లేచి, గోడమీద ఉన్న చిత్రం వైపు వేలు చూపించి

ఆ చిత్రం ఒక ప్రముఖ డచ్ చిత్రకారుడు వేసిన చిత్రంకి ఫోటో అనుకరణ. దాని పేరు ' ఓ కాలిపోతున్న ఉరు'.

'ఆహా, దానిగురించి ఏం కలొచ్చింది? ' తండ్రి అడిగాడు.

' నాకు తెలియదు'

' ఊహు, గుర్తు తెచ్చుకోడాని ప్రయత్నించు'

' ఉ... మంటలున్నాయి, నేనో కుక్క పిల్లని ముట్టుకున్నానుట'''

' కానీ నీకు కుక్కలంటే భయం కాదు?'

' అవును, కానీ బోమ్మలో ఉన్న కుక్క పిల్లని కొంచెం ముట్టుకోగలను'''

అలా అని తనలో తాను నవ్వుకుంటూ, గెంతుతూ గదంతా తిరుగు తున్నాడు.

అలా తిరుగుతూ తండ్రి దగ్గరకి వచ్చి, ఆగి, " నాన్నా ఆ బోమ్మ గోడమీదినుండి దించు. నిన్న చూపించావుగా ఆలా ఆ బొమ్మ మళ్ళీ చూపించవా?"

ఆ చిత్రం ఆ గదిలోకి కొత్తగా నిన్ననే వచ్చింది. అంతకు ముందున్న చుట్టాల ఫోటోలన్నీ ఆ కుర్రాడికి బాగా పరిచయం ఉన్నవే. వాటికంటే ' ఓ కాలిపోతున్న ఉరు' చిత్రం చాలా విశేషాలతో, జీవం ఉట్టిపడుతూ, ఆకర్షణీయంగా ఉంది. కుర్రాడు అడిగినట్లే తండ్రి ఆ చిత్రాన్ని క్రిందికి దించి కొడుకుతో కలసి చూస్తున్నాడు.

నదీ ముఖద్వారం సముద్రంలోకి కలిసే ప్రదేశం నిండా చాలా పడవలు, లాంచీలు ఉన్నాయి. అందంగా వంపుతిరిగి ఉన్న వంతెన రెండు ప్రక్కల బురుజులు. ఎడమ ఒడ్డున ఒక కాలిపోతున్న ఉరు. చిన్న చిన్న ఇళ్ళ వరుసలు. ఇళ్ళ మీద కొన్నింటికి పొట్టి, మరికొన్నింటిమీద పొడవైన ఇంటి కప్పులు. క్రైస్తవ దేవాలయాలు, వాటి గంటల గోపురాలు. కంగారుగా ఆటూ ఇటూ పరుగెడుతున్న జనం. పెద్ద పెద్ద మంటలు, వాటి జ్వాలలు గాలిలో ఆకాశంవైపు ఎగురుతూ, వాటిని ఆవరిస్తూ సుళ్ళు తిరుగుతున్న దట్టమైన పొగ మేఘాలు. గోడలకి వేయబడి ఉన్న నిచ్చెనలు. వాలిపోతున్న గుర్రపు బళ్ళు. మంటలనుండి ప్రాణరక్షణకై వంతెన వైపు పరుగెడుతున్న మనుషులు. రేవు గట్టున పీపాలు, సంచులు, రకరకాల కలప. నీటిలో మనుషులు ఎక్కువై మునిగిపోబొతున్న పడవ. వంతెన ముందు ఒకదానిని మరొకటి వాసన చూస్తున్న కుక్క పిల్లలు. వంతెనకి ఆవతలివైపు నది ముఖం విశాలమై, సముద్రాన్ని కలిసే చోట ఎక్కడో ఎత్తులో ఆ క్షితిజానికి ఆతి దగ్గర అనిపించే లాంటి ప్రదేశంలో ఆ చిత్రానికి అతి ముఖ్యమైన స్థానంలో , ఒక పలుచని పొగ మేఘం వెనుక కాలిపోతున్న ఊరిని, ఆక్కడి వేదనని చూస్తూ కళ తప్పి, వెలుగు విరజిమ్మలేని చంద్రుడు.



"నాన్నా, ఈ ఊరెందుకు కాలిపోతున్నది?"

"ఎవరో నిప్పుతో అజాగ్రత్తగా ఉండడంవల్ల"

"ఎవరు?"

"ఉ... ఎవరన్నది చెప్పలేం, చాలా కాలం అయిపోయింది కదా"

" ఎంత కాలం అయింది?"

"కొన్ని వందల ఏళ్ళు అయిఉంటుంది ఆ ఊరు కాలిపోయి"

ఆ కుర్రాడికి ఈ సమాధానం కొత్తగా ఏదీ బోధపరచలేదు. ఈ విషయం ఆ తండ్రికి కూడా తెలుసు. కానీ ఏదో ఒక సమాధానం చెప్పాలని చెప్పేడు. నిశ్శబ్దంగా తనలో తాను ఆలోచించుకుంటూ కూర్చున్నాడు ఆ కుర్రాడు కొద్దిసేపు. కొత్తకొత్త ఆలొచనలు, రకరకాల భావాలు పాతవాటి చుట్టూ

తిరుగుతూ, రాసుకుంటూ, తోసుకుంటూ, తమకొ నిర్దిష్టమైన స్థానం కల్పించకుంటూ ఆ కుర్రాడి మెదడులో తిరుగుతున్నాయి.

" సరే, కానీ ఈ ఊరు నిన్న కాలిపోతున్నాది, ఇవాళ కూడా కాలిపోతున్నాది ? అవునా?" అని అన్నాడు ఆ చిత్రం వైపు వేలు పెట్టి చూపిస్తూ.

" ఇది నిజమైన ఊరు కాదు, ఇది ఉత్తి బొమ్మే. నిజమైన ఊరు కాలిపోయి చాలా కాలం అయింది. చాలా చాలా కాలం క్రిందట కాలిపోయింది. అది ఇప్పుడు లేదు. ఆక్కడ పరిగెడుతున్న మనుషులు లేరు. వాళ్ళంతా చనిపోయారు. ఇప్పుడు లేరు. ఆ ఇళ్ళన్నీ కాలిపోయాయి. గంటల గోపురాలు పడిపొయాయి. ఆ వంతెన కూడా పోయింది.

"ఈ గంటల గోపురాలు కాలి పడిపోయాయా? విరిగి పడిపోయాయా?"

" అవి కాలి, విరిగి పడిపోయాయి"

" ఈ స్టీమర్లువాళ్ళు కూడా చచ్చిపోయారా?"

" ఆవును. కానీ ఆవి స్టీమర్లు కావు, పడవలు. అప్పుడు స్టీమర్లు లేవు."

కింది పెదవి విరిచి, నిశ్శబ్దంగా తనలో తాను ఆలోచించుకుంటూ, విచారంగా కూర్చున్నాడు ఆ కుర్రాడు కొద్దిసేపు.

" కానీ నాకు స్టీమర్లు కనిపిస్తున్నాయి. నాన్నా ఈ స్టీమర్ పేరేంటి?"

ఆ కుర్రాడి బద్ధికి ఎంతతోస్తే అంతే. వాడి తండ్రి వాడి ప్రశ్నలకి జవాబులు చెప్పి చెప్పి, ఇక చెప్పలేక విసిగిపోయాడు. కుర్రాడు ఆ బొమ్మలో ఉన్న డచ్ వ్యాపార పడవలపై వేలు పెట్టి చూపిస్తూ , ఇది బార్జ్, ఇది హిల్లరో, ఇది ప్రిన్స్ ఇంగర్బోగ్ అని తనలో తాను మాట్లాడుకుంటున్నాడు.

"నాన్నా ఈ చంద్రుడు కూడా పోయాడా?"

"లేదు, ఆ చంద్రుడు ఇంకా ఉన్నాడు. ఈ బొమ్మ అంతటికీ ఈ చంద్రుడొక్కడే ఇంకా ఉన్నాడు. ఇదే చంద్రుణ్ణి నిన్న నువ్వు నీ కిటికీ లోంచి చూసావు." అన్నాడు ఆ తండ్రి కొత్త ఉత్సాహంతో.

మళ్ళీ ఆ కుర్రాడు నిశ్శబ్దంగా తనలో తాను ఆలోచించుకుంటూ కూర్చున్నాడు కొద్దిసేపు. అప్పుడు మరో ప్రశ్న వచ్చింది.

"నాన్నా, ఈ ఊరు కాలిపోయి చాలా కాలం అయిందా? మనం అంతా కలసి ప్రిన్స్ ఇంగర్బోగ్ స్టీమర్లో తాతగారి ఇంటికి వెళ్ళిన దానికంటా వెనకా?"

" ఆవును, ఇంకా, ఇంకా వెనక, ఆ ఊరు కాలిపోతున్నప్పుడు నువ్వు, నేను, మీ అమ్మ, అమ్మమ్మ కానీ ఎవ్వరం లేము".

ఆ కుర్రాడి మొహం ఉన్నట్టుండి గంభీరంగా మారిపోయింది. చాలా విచారంగా ఉన్నాడు.

మళ్ళీ ఆ కుర్రాడు నిశ్శబ్దంగా తనలో తాను ఆలోచించుకుంటూ కూర్చోన్నాడు కొద్దిసేపు. రకరకా ప్రశ్నలు, ఆలోచనలు వస్తూ పోతున్నాయి. వాటిని ఒక పద్దతిలో పెట్టలేకపోతున్నాడు.

"నాన్నా, ఈ ఊరు కాలిపోతున్నప్పుడు నేనెక్కడున్నాను? నేను అమ్మతో తాతగారి ఊరు గ్రానా లో ఉన్నానా?"

"లేదురా, ఈ ఉరు కాలిపోతున్నప్పుడు, నువ్వు లేనేలేవు"

కింది పెదవి విరిచి, నిశ్శబ్దంగా ఉన్న ఆ మెహం 'ఇది నేను ఒప్పుకోను' అన్నట్లుంది. దాన్ని ధృవపరస్తున్నట్లు

" కానీ నేనెక్కడున్నాను అప్పుడు? " అని అడిగాడు గట్టిగా

" నువ్వసలు లేనే లేవు" అన్నాడు తండ్రి

ఆ కుర్రాడు తన కళ్ళు విశాలం చేసుకుని తండ్రిని చూసాడు. తన తండ్రి తనని ఆటపట్టించడానికి ఇలా అంటున్నాడని తోచింది. తనని ఆడించే ఆడపిల్లలు కూడా అప్పుడప్పుడు ఇలాగే నమ్మలేని కబుర్లు చెప్పి, నవ్వించి, తరవాత అది నిజం కాదు అంటారు తనని ఆటపట్టించడానికి. తండ్రి కూడా ఇప్పుడు అదే చేస్తున్నాడు. లేకపోతే తను అప్పుడు లేకుండా ఇప్పుడు ఎలా వచ్చాడు. ఇప్పుడుంటే అప్పుడు లేకపోవడం ఏమిటి.

ఒక రాత్రి వేళ మెలుకువ వస్తే చుట్టూ చీకటి. ఇంకేమీఉండదు. కనబడదు. కానీ చీకటి కనిపించింది అంటే నేను ఉన్నట్టే. నేను లేకపొతే చీకటి నాకు ఎలా కనిపిస్తుంది? అందుకే నేనుట్టే. ఒక్కసారిగా ఆ చిత్రంనుండి, తండ్రి నుండి దూరంగా జరిగి కిటికీలోంచి గదిలో ఆకు పచ్చని తివాసి పై పడుతున్న సూర్య కాంతిలో గెంతుతూ, గొంతెత్తి ఆనందంతో, ప్రపంచం అంతటికి తెలియ చెప్పాలన్న ఉత్సాహంతో

" నేనున్నాను, నేనున్నాను, నిజం, నేనున్నాను" అన్నాడు.

*　　　　　*　　　　　*

[ ఆత్మ పరంగా ఆలోచిస్తే ఆ పిల్లాడి ఆలోచన నిజమే అని అనిపిస్తుంది. జన్యు శాస్త్ర పరంగా ఆలోచించినా - డిన్ఎ (జన్యు పదార్థం) అనువంశికత పరంగా చూస్తే పరిణామక్రమంలో 'జీవం' మూడు వందకోట్ల సంవత్సరాల పైగా ఎడతెగన భౌతిక అభౌతిక అవిభాజ్య సంబంధం కలది. అందుచేత పిల్లాడి మాట తర్కానికి కూడా నిలిచి నిజమే అని అనిపిస్తుంది.

ఆత్మ నిత్యత్వం గురించి కాని, జీవ శాస్త్రం, జన్యు పదార్థం గురించి కానీ ఏమీ తెలియని ఆ పిల్లాడికి తన అస్థిత్వంపై అంత ప్రగాఢమైన నమ్మకం ఎలా కలిగింది? పుట్టిన ప్రతి జీవికి తన అస్థిత్వం పై అంతటి నమ్మకం ఉండడమే ఈ మానవ జాతి మనుగడకి మూలాధారామా?

- కలశపూడి శ్రీనివాసరావు ]

*　　　　　*　　　　　*